## జనగణనపై షార్ట్ ఫిలిం చిత్రీకరణ

**పాపన్నపేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** త్వరలో జరగబోయే జనగణనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో పాపన్నపేటలో షార్ట్ ఫిలిం చిత్రీకరించారు. ఈ కార్యక్రమానికి పాపన్నపేట తెలుగు ఉపాధ్యాయులు అంజాగౌడ్ దర్శకత్వం వహించగా వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చిత్రీకరించారు. ముఖ్యంగా జనగణన లో తమ వివరాలు అందిస్తే, ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథకాల నుండి తమ పేర్లు ఎక్కడ తొలగిస్తారో అన్న అపోహ నుండి ప్రజలను దూరం చేయాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చిత్రీకరించారు, కెమెరామెన్ గా శ్రీకాంత్,ఎడిటర్గా సందీప్ వ్యవహరించారు. అంతేకాకుండా జనగణన పై ప్రతి ఒక్క రికి అవగాహన కల్పించి, జనగణన కోసం తమ ఇండ్లకు వచ్చి ఎన్యూమరేటర్లకు సహకరించాల్సిందిగా వారు సూచించారు. ఫీల్డ్ ట్రైనర్లు శ్రీనివాస్‌రెడ్డి, రమణ, భట్టు నాగరాజు,ఉపాధ్యాయ సంఘాల నాయకులు బాలరాజు, పంతుల రాజు, భూషణం, కేవీఆర్ నాయుడు, దుర్గాప్రసాద్, బాలమల్లేష్, ఎల్లం, మంగ నర్సింలు, వీరేశం, సాయి సిరి, దత్తు రెడ్డి, వేణు,సంతోష్, మోహన్‌రావు, సుమలత, శ్రావణి, కరుణ తదితరులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## ప్రాథమిక విద్యను అంగన్‌వాడీలోనే ప్రారంభించాలి

### -సిడిపిఓ సుశీల

**జహీరాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** తమ చిన్నారులను అంగన్‌వాడి పాఠశాలలో చేర్పించి ప్రాథమిక విద్యను అందుకునేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని జహీరాబాద్ సిడిపిఓ సుశీల సూచించారు. శనివారం పట్టణంలోని ఆర్యనగర్ కాలనీలోని ఆరెకటిక సమాజ్ భవనంలో గర్భిణీలకు శ్రీమంతాలు, ఆరు నెలల నిండి ఏడవ నెలలో పడిన పిల్లలకు అన్న ప్రాసన చేసుకుని 5 సంవత్సరాలు పూర్తయిన చిన్నారులకు ప్రైమరీ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులతో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమానికి సిడిపిఓ సుశీల, మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డిలు హాజరై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బొగ్గుల స్వప్న, సంతోష్, సెక్టర్ సూపర్‌వైజర్ సునీత బాయి, జైపాడ్ లక్ష్మి అంగన్‌వాడి టీచర్లు నాగరాణి, కృష్ణవేణి, అతిగా బేగం, జబీన్ జ్యోతి, సుమతి, రెహానా, సరిత, విజయశ్రీల తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

## అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు

### మంత్రి దామోదర్ రాజనర్సింహా

**అల్లాదుర్గం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన రేగోడ్‌లో గ్రామానికి చెందిన అందోల్ మహేష్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని శనివారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తోందని గుర్తు చేశారు. అర్హులైన పేదలందరికీ దశల వారిగా ఇండ్లను కేటాయిస్తున్నామన్నారు.కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు మున్నూర్ కిషన్, డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజేష్, రేగోడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దిగంబర్‌రావు, నాయకులు, సర్పంచ్లు భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సంగమేశ్వర్, పర్విన్ చోటుమియా, పిర్యానాయక్ పాల్గొన్నారు.

### జాతరలో పాల్గొన్న మంత్రి



వీరభద్రస్వామి జాతరలో పాల్గొన్న దామోదర్ రాజనర్సింహా

**అల్లాదుర్గం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన రేగోడ్‌లో కొలువున్న శ్రీ వీరభద్రస్వామి ఆధ్యాత్మిక క్షేత్రంలో కొనసాగుతున్న జాతర ఉత్సవాల్లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని ఆరాధన మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ అందోల్‌నియోజకవర్గంలోని చౌటకూర్ వట్‌పల్లి మండలల్లో మండల పరిషత్ కార్యాలయ భవనాల నిర్మాణానికి 380లక్షల రూపాయలను మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు మున్నూర్ కిషన్, డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజేష్, రేగోడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దిగంబర్‌రావు, నాయకులు, సర్పంచ్లు భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సంగమేశ్వర్, పర్విన్ చోటు మియా, పిర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర జాబ్ మేళా సక్సెస్

### 624 మందికి ఉద్యోగాలు

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**



నియామక పత్రాలు అందిస్తున్న పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాల్

సిద్దిపేట జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్దిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర - మెగా జాబ్ మేళా శనివారం ఘనంగా ముగిసింది. స్థానిక పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి యువత భారీగా తరలివచ్చి విశేష స్పందన కనబరిచారు. ఈ జాబ్ మేళాలో సుమారు 65 ప్రముఖ కంపెనీలు పాల్గొని ఐటీ, ఫార్మా, టెక్నికల్, స్కిల్డ్ వర్క్, సేల్స్ సర్వీసెస్ వంటి విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. 2000 మందికి పైగా అభ్యర్థులు హాజరై ఇంటర్వ్యూలలో పాల్గొనగా, వారిలో 624 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. ముఖ్యంగా మహిళా అభ్యర్థులు గణనీయంగా ఎంపిక కావడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాల్ ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు శాఖ బాధ్యతలు కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, సమాజ శ్రేయస్సులో భాగస్వామ్యం వహించడం కూడా తమ కర్తవ్యం అన్నారు. యువతకు మార్గదర్శకత్వం అందిస్తూ వారి భవిష్యత్తుకు పునాది వేయడంలో ఉద్యోగ మిత్ర కార్యక్రమం కీలక వేదికగా నిలుస్తోందని తెలిపారు. ఒక్కరోజులోనే 624 మందికి ఉపాధి అవకాశాలు లభించడం ఆనందకరమని, ఇది యువతలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధిపై అవగాహన పెంపుకు దోహదపడుతుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు సిద్దిపేట పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు కుశాల్కర్, సుభాష్ చంద్రబోస్, ట్రైనీ ఐపిఎస్ ఆయేషా ఫాతిమా, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు గోపన్‌పల్లిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

### -హాజరుకానున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

**మొగుడంపల్లి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

ఈ నెల 26న మండల పరిధిలోని గోపన్‌పల్లిలో ఏర్పాటు చేసిన భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని విగ్రహ దాత రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, కార్మాగారాలు, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సాయంత్రం 4 గంటలకు ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అంబేద్కర్ అభిమానులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, విద్యార్థులు, యువకులు, నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయం వంతం చేయాలని నిర్వాహకులు సూచించారు.

# పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

### మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

**నర్సాపూర్ రూరల్, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా నారాయణపూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల కోసం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతగా ప్రజలకు సేవ చేయాలని, కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి, విద్యార్థుల నమోదు పెంచేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మెదక్ ఆర్డీవో రమాదేవి, నారాయణపూర్ సర్పంచ్ దేవి సింగ్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, తహసీల్దారులు, ఎంపీడీవోలు, జిల్లాఅధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

# నేటి నుంచి సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రారంభం

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

సెన్సస్ 2027 ప్రక్రియలో భాగంగా ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు నిర్వహించనున్న స్వీయ గణన(ఎన్యూమరేషన్)పై జిల్లాస్థాయి అధికారులకు కలెక్టర్ కె.హైమావతి దిశానిర్దేశం చేశారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జూమ్ సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెన్సస్ 2027లో భాగంగా జిల్లాలో స్వీయ గణన ప్రక్రియను ఏప్రిల్ 26, 2026 నుండి మే 10, 2026వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచిస్తూ, ఏప్రిల్ 26న జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు,జడ్జీలు, ఎమ్మెల్సీలకు ముందస్తు సమాచారం అందించి, వారి స్వగృహాల్లోనే నిర్దేశిత వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ ఎన్యూమరేషన్, జియో ట్యాగింగ్ ప్రక్రియను ఎన్యూమరేషన్ ద్వారా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రెండు విడతలుగా ఎన్యూమరేషన్‌కు శిక్షణ అందించినట్లు వివరించారు. ప్రతీ మండలంలో గ్రామాల వారీగా సర్పంచులు, స్థానిక ప్రముఖులు, మహిళా సంఘాల అధ్యక్షుల సహకారంతో ప్రజలు సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలకు సూచించారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్ల ద్వారా ఈ ప్రక్రియను విస్తృతంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు తమ స్వగృహాల వద్దే సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తి చేయాలని తెలిపారు. ఈ డిజిటల్ విధానం ద్వారా పౌరులు ఇంట్లో నుంచే ఆన్‌లైన్ ద్వారా గృహ వివరాలను నమోదు చేసుకోవచ్చని, దీనివల్ల గణన ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగంగా సాగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సెన్సస్ 2027ను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రోజు వారీ లక్ష్యాల ప్రకారం ఈనెల 30నాటికి ఎలక్టోరల్ మ్యాపింగ్ పూర్తి చేయాలని తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ, జెడ్పీసీఈఓ రమేష్, డీపీఓ రవీందర్, సెక్టోరల్ అధికారి రామస్వామి, సూపరింటెండెంట్ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

## చెక్కుల పంపిణీలో రసాబాస

### మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే సునీతరెడ్డి మధ్య వాగ్వాదం

**నర్సాపూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ రసాబాసాగ మారింది. మంత్రి వివేక్‌వెంకటస్వామి, ఎమ్మెల్యే సునీతరెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే శనివారం నర్సాపూర్‌లోని సాయికృష్ణ కళ్యాణ మండపంలో జరిగిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు వ్యతిరేక నినాదాలు చేసుకున్నారు. మహిళలకు 2500, కళ్యాణలక్ష్మి పథకంలో తులం బాంగారం ఎప్పుడు చెల్లిస్తారని ఎమ్మెల్యే సునీతరెడ్డి ప్రశ్నించగా, మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ వేలకోట్ల అప్పులు చేశారని అంటుండగానే కార్యకర్తలు నినాదాలు చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బిఆర్ఎస్ ప్రభుత్వం కారణమని అనడంతో ఎమ్మెల్యే సునీతరెడ్డి కలగజేసుకొనడంతో మంత్రి వివేక్ ఎమ్మెల్యే సునీతరెడ్డి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఎమ్మెల్యే సునీతరెడ్డికి నచ్చజెప్పి ప్రయత్నం చేసినా వినకపోవడంతో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే సునీతరెడ్డి మధ్య వాగ్వాదం జరగడంతో బిఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ డౌన్ డౌన్ బిఆర్ఎస్ డౌన్ డౌన్ అంటూ ఒకరిపై ఒకరు వ్యతిరేక నినాదాలు చేయడంతో సమావేశ ప్రాగణం దద్దరిల్లింది. ఈ సందర్భంగా పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాల వారిని శాంతింప జేశారు. దీంతో ఈ రసాబాసా ముగిసింది.

## దేవాలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 25,ప్రభాతవార్త:** మండల పరిధి చందంపేటలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో చోరీకి పాల్పడిన నిందుతుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గత సంవత్సరం అక్టోబర్, ఈ సంవత్సరం మార్చి నెలలో గుర్తు తెలియని దుండగులు ఆలయంలోని హుండీని పగలగొట్టి సొత్తును ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు రెండు దొంగతనాలకు పాల్పడింది ఒకడేనని అన్నారు. దొంగతనానికి పాల్పడింది చేగుంట మండలం రెడ్డిపల్లికి చెందిన ఉప్పు రమేష్ (30)గా గుర్తించామని, నిందుతుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ నారాయనగౌడ్ తెలిపారు.




నిందుతుడి వివరాలను వెల్లడిస్తున్న ఎస్సై నారాయణగౌడ్

# పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నదే లక్ష్యం

### మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

**నర్సాపూర్ ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వ ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రంలో అర్హులైన పేదలకు 17 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యం అని కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాస్త్ర మంత్రిత్వ శాఖల, మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం నర్సాపూర్ మున్సిపాలిటీలో 6,5 వార్డులలో నూతనంగా నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇళ్లను మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై కలెక్టర్ ప్రతిమ సింగ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నర్సాపూర్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, ప్రస్తుతం కొన్ని పూర్తయి ప్రారంభించడం జరిగిందని, మరికొన్ని వివిధ దశల్లో కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు, వచ్చే సంవత్సరం మరో 2500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను 100 పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా నర్సాపూర్ మున్సిపాలిటీలో 15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి అభివృద్ధి పనులకు మంత్రి వివేక్ వెంకటస్వామి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు సేవాభావంతో పనిచేయాలన్నారు. వేసవికాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా మున్సిపల్ పాలకవర్గం చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ వైస్‌చైర్మన్ వనముల బుచ్చేష్‌యాదవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, కౌన్సిలర్లు శ్రీకాంత్, నిరంజన్‌దాస్, లలిత బిక్షపతి, పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో పర్యటిస్తున్న మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తదితరులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సదానందం

## పసికందు హత్య కేసు ఛేదించిన పోలీసులు

### తల్లిదండ్రులతో పాటు ఆర్ఎంపి అరెస్ట్

**అక్కన్నపేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కేశనాయక్ తండాలో గత సంవత్సరం జూలైలో పసికందు మృతి కేసును పోలీసులు ఛేదించారు. అప్పట్లో తండా శివారులోని వాగులో గుర్తు తెలియని శిశువు మృతదేహం నీటి ప్రవాహంలో కొట్టుకువచ్చిన ఘటనపై గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసును అక్కన్నపేట ఎస్ఐ ప్రశాంత్, హుస్నాబాద్ సిఐ కోండ్ర శ్రీను ఆధ్వర్యంలో పోలీసులు విచారించారు. శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక సమాచారంతో దర్యాప్తు కొనసాగించగా అసలు విషయాలు బయటపడ్డాయి. దర్యాప్తులో భాగంగా కేశనాయక్ తండాకు చెందిన బానోతు లక్ష్మికి లేటు వయస్సులో గర్భం దాల్చడం, అప్పటికే ఆమె కుమార్తెలకు వివాహాలు కావడం వల్ల ఈ విషయం బయటపడితే పరువుపోతుందనే భయంతో భర్త రాజుతో కలిసి గర్భాన్ని రహస్యంగా తొలగించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తేలింది. ఇందుకోసం కుందానవానిపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వంశీ సహకారంతో టాబ్లెట్లు తీసుకున్నారు. అయితే శిశువు సజీవంగా పుట్టడంతో విషయం బయటపడుతుందనే భయంతో తల్లిదండ్రులు కలిసి ఆ శిశువును రహస్యంగా తొలగించాలని భావించి, పుట్టిన వెంటనే ఇంటి సమీపంలోని నీటి కాలువలో పడవేశారు. దీంతో శిశువు నీటిలో మునిగి మృతి చెందినట్లు విచారణలో నిర్ధారించారు. ఈ ఘటనలో శిశువు మృతికి కారణమైన తల్లిదండ్రులు బానోతు లక్ష్మి, రాజుతోపాటు అనుమతి లేకుండా టాబ్లెట్లు అందించి సహకరించిన ఆర్ఎంపీ వంశీని పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని శనివారం అక్కన్నపేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఏసీపీ సదానందం వెల్లడించారు.

## ఇంటర్ ఫెయిల్ అయ్యానని విద్యార్థి ఆత్మహత్య

**మిరుదొడ్డి, ఏప్రిల్ 25,ప్రభాతవార్త :** ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాలలో ఉత్తీర్ణత సాధించకపోవడంతో ఓ విద్యార్థి మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని చిన్న నిజాంపేట గ్రామంలో శనివారం జరిగింది. భూంపల్లి పోలీసుల కథనం ప్రకారం... చిన్ననిజాంపేట గ్రామానికి చెందిన షేర్ల సాయిరాం(17) ఇంటర్ రెండో సంత్సరంలో ఫెయిల్ కావడంతో మరస్తా పానికి గుర్రై చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

## భవనం పైనుంచి పడి తాపీమేస్త్రీ మృతి

**వర్గల్, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** ప్రమాదవశాత్తు భవనం పైనుండి పడి తాపీ మేస్త్రీ మృతిచెందిన సంఘటన వర్గల్ మండలంలో చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గిర్మాపూర్ గ్రామానికి చెందిన గరుగుల ఎల్లయ్య అనే వ్యక్తి తాపీ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం పని నిమిత్తం నాచారం గ్రామంలోని శ్రీనుకు చెందిన ఇంటికి వెళ్లి మొదటి అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. దీంతో అతని తలకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం గజ్వేల్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య గరుగుల కమలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**నాగల్‌గిద్ద, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** జీవితంపై విరక్తి చెంది చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని గంగారం తండాలో శనివారం ఉదయం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం...తండాకు చెందిన రాథోడ్ కిషన్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని సాకుతున్నాడన్నారు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండటంతో జీవితంపై విరక్తి చెంది తండా శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి భార్య లలితాబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాథోడ్ కిషన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తండా వాసులు వినతి చేస్తున్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**చౌటకూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** మండలపరిధిలోని శివంపేట గ్రామ శివారులో 161వ జాతీయ రహదారపై గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పుల్‌కల్ ఎస్ఐ విశ్వజన్ నల్లా కథనం ప్రకారం... ఈ నెల 9న 60 సంవత్సరాల వయసుగల వ్యక్తి తలపై గాయాలతో అపస్మారక స్థితిలో రోడ్డుపై పడిఉన్నాడు. అతడిని సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి 17వ తేదీన తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడు చామనచాయ రంగు, 5.4 అడుగుల ఎత్తు, తెలుపు రంగు ఫుల్‌షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చినట్లు ఎస్ఐ వివరించారు. సదరు వ్యక్తిని గుర్తిస్తే పుల్‌కల్ పోలీసు ఠాణా 8712656754కు సమాచారం అందించాలని ఎస్ఐ నల్లా విశ్వజన్ సూచించారు.

## కాపర్ బండల్స్ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

**ములుగు, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** ములుగు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొట్యాల గ్రామ శివారులో ఉన్న ప్రైవేట్ పరిశ్రమలో జరిగిన కాపర్ బండల్స్ దొంగతనం కేసులు పోలీసులు వేగంగా ఛేదించారు. శనివారం ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గజ్వేల్ రూరల్ సిఐ రవిరాజు కథనం ప్రకారం... గత నెల 27న రాత్రి విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డు పవిత్ర బోరా, అక్కడ నిల్వ ఉంచిన కాపర్ బండల్స్‌పై కన్నేసి వాటిని దొంగతనం చేయాలనుకున్నాడు. ఈ పనికోసం కర్కపట్లకు చెందిన స్క్రాప్ వ్యాపారి తరుణ్‌కుమార్‌ను సంప్రదించాడు. ఇద్దరూ కలిసి రెండు విడతల్లో కాపర్‌బండల్స్‌ను బయటకు తరలించి, స్క్రాప్‌షాప్‌వద్ద దాచారు. అనంతరం వాటిని విక్రయించేందుకు తరలిస్తున్న సమయంలో కొట్యాల చౌరస్తా వద్ద ములుగు ఎస్ఐ రఘుపతి, పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా తరుణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో వారు చేసిన నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. సుమారు రూ.15 లక్షల విలువైన ఏడు కాపర్ బండల్స్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు తరుణ్‌కుమార్ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, గాలింపు కొనసాగుతుందన్నారు. కేసును త్వరగా ఛేదించిన మర్కుక్, ములుగు ఎస్ఐలు దామోదర్, రఘుపతిలను సిఐ రవిరాజు అభినందించారు.



చోరీ వివరాలు తెలుపుతున్న సిఐ రవిరాజు

# మే డే వారోత్సవాలను జయప్రదం చేయాలి

## సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త**

ప్రపంచ కార్మిక దినోత్సవం (మేడే) వారోత్సవాలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేటలో జరిగిన సిఐటియు నియోజకవర్గ స్థాయి సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చుక్క రాములు మాట్లాడుతూ మేడేను ప్రతి సంవత్సరం మే 1న ప్రపంచవ్యాప్తంగా కార్మికుల పోరాట దినంగా జరుపుకుంటున్నామని తెలిపారు. 1886లో అమెరికాలోని హే మార్కెట్ ఘటనను స్మరించుకుంటూ, అప్పట్లో కార్మికులు 18 గంటలపాటు పనిచేసే దుస్థితి ఉండేదని, కార్మిక వర్గం పోరాటాలతోనే 8 గంటల పని విధానం సాధ్యమైందని వివరించారు. ఆ పోరాటాల్లో పలువురు కార్మికులు ప్రాణాలు అర్పించారని, వారి త్యాగాల స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా కార్మిక ఉద్యమాలు బలపడినట్లు చెప్పారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు చేస్తూ మేడే స్ఫూర్తికి విఘాతం కలిగించే విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. కార్మిక హక్కులను పరిరక్షించుకోవాలంటే ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మేడే వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, సహాయ కార్యదర్శి మామిడాల కనకయ్య, జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల కనకయ్య, వేముగంటి సాయిలు, హమాలి యూనియన్ నాయకులు, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్, ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సిఎం, మంత్రులకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

## హుస్నాబాద్‌లో ఆర్టీసీ కార్మికుల సంబరాలు

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు మద్దతుగా హుస్నాబాద్ బస్టాండ్‌లో శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మికొమురయ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకంచేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, 30 ముఖ్య అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యంగా ఆర్టీసీకార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల గుర్తింపు ఇవ్వడం ద్వారా వారి కుటుంబాలకు భద్రత కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారని, మూడు రోజుల వ్యవధిలోనే కీలక నిర్ణయాలు తీసుకుని సమ్మెలను నివారించడం జరిగిందని, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిత్తారి పద్మ రవీందర్, ఏఎంసి చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు బురుగు లతకిష్టస్వామి, వైద్యం కిరణ్, పూదరి వరప్రసాద్, ఆకుల రజితవెంకన్నతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**అక్కన్నపేటలో...**

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అక్కన్నపేటలోనీ అంబేద్కర్‌చౌరస్తా వద్ద ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకుని ఆనందోత్సాహాలతో వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఐలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ సిబ్బంది, పాల్గొన్నారు.

## రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

### మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


తిప్పారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

**కొండపాక, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** దళారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్‌రెడ్డి రైతులకు సూచించారు. శనివారం లకుడారం గ్రామంలో పిఎసిఎస్ అధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సర్పంచ్ శిల్ప నర్సింహులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మి గిట్టుబాటు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దేవి రవీందర్, ఉప సర్పంచ్ యెల్లు శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు దేవి నర్సింలు, కళ కర్నాకర్, గట్టు చంద్రం, వంకని రాజు, సాయిలు, లావణ్య బిక్షపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగపూరి సుజాత, కాంగ్రెస్ నాయకులు అండాలమ్మ, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కుకునూరుపల్లి, బొబ్బాయిపల్లి, తిప్పారం, మేదినిపూర్, మాత్‌పల్లి, దుద్దెడ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వామివారిని దర్శించుకున్న ఆడిట్ అధికారులు



అధికారులకు స్వామి వారి చిత్రపటాలను అందజేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, ఏప్రిల్ 25,ప్రభాతవార్త :** రాష్ట్ర ఆడిట్ డిపార్టుమెంట్‌కు చెందిన ఉన్నతాధికారులు శనివారం మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు.డైరెక్టర్ నరసింహులు,జాయింట్ డైరెక్టర్ పరుశరాములు ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు స్వామి వారి చిత్ర పటాలు, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ అధికారి జయశ్రీ, ఆలయ అధికారులు బుద్ది శ్రీనివాస్, రావుల సుదర్శన్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు నీల చంద్రశేఖర్, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ములుగు, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** మండల కేంద్రానికి చెందిన కాశమైన బాలనర్సింలు అనారోగ్య కారణంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పంచాయతీరాజ్ సంఘటన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కడపల్ల నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి, జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు సలీం, గజ్వేల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి శనివారం బాలనర్సింలు మృతదేహం వద్ద సంతాపం తెలిపి, కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట వార్డు సభ్యుడు మంద వెంకటేష్, నాయకులు నరేందర్‌రెడ్డి, సత్తిరెడ్డి తదితరులు ఉన్నారు.

### వీరారెడ్డిపల్లిలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

**రాయపోల్, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సర్పంచ్ రొయ్యల సుగుణ శ్రీనివాస్ విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 25 సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారాయని తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా పాత స్తంభాలను తొలగించి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కొన్ని ప్రాంతాలలో విద్యుత్ వైర్లు వదులుగా ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాటిని సరిచేయడంతో పాటు గ్రామంలో నెలకొన్న తక్కువ వోల్టేజ్ సమస్యను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు. ఈ సమస్యలపై స్పందించిన ఏఈ శ్రీనివాసరావు అవసరమైన చర్యలు తీసుకొని వీటిని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగరాజు పాల్గొన్నారు.


విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


హైకోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాండును సత్కారిస్తున్న దృశ్యం

## ముదిరాజులు ఐకమత్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలి

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన డిఎల్ పాండు ముదిరాజ్ మొదటి సారిగా సిద్దిపేటకు రావడంతో ముదిరాజ్ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ప్రశాంత్‌నగర్ పెద్దమ్మ దేవాస్థానంలో ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్, యూత్ అధ్యక్షులు పడిగే ప్రశాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడికాయల వెంకటేశం, పుల్లూరు సుధాకర్, సుతారి రాజు తదితరులు ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా డిఎల్ పాండు మాట్లాడుతూ ముదిరాజులు అందరూ ఐక్యమత్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. జాతి కోసం న్యాయ సమస్యలు ఉంటే పాటుపడుతానని తెలిపారు. కార్యక్రమంలో రాజన్న, బాల్‌రంగం, శ్రవణ్, రాజయ్య, అరవింద్, శేఖర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శిక్షణ తరగతులు..జనగణన కిట్ల పంపిణీ


జనగణన కిట్లు అందిస్తున్న దృశ్యం

**బెజ్జంకి, ఏప్రిల్ 25,ప్రభాతవార్త :** మండల కేంద్రంలో 2027 జనగణన 3 రోజుల శిక్షణ తరగతులను బాలుర ఉన్నత పాఠశాలలో విజయవంతంగా నిర్వహించారు. జనగణనపై ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, శిక్షణను పొందారు. సమర్థవంతంగా జనగణనలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా నిత్యం పర్యవేక్షణ జరపాలని తహశీల్దార్ తెలిపారు. అనంతరం తహశీల్దార్ శ్రీకాంత్ ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు జనగణన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ట్రైనర్ మనోహర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**కొల్చారం, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పైతర గ్రామానికి సంబంధించిన కళ్యాణలక్ష్మి చెక్కులను శనివారం నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్‌లో లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ శ్రీనివాస్ చారి, పైతర సర్పంచ్ రవితేజరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌కు సన్మానం

**హత్నూర ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** ఉపాధి హామీ పథకంలో అత్యధికంగా ఉపాధి కూలీలకు పని కల్పించే హత్నూర మండలంలో అగ్రస్థానంలో నిలిచిన, హత్నూర మండలం నవాపేట గ్రామం ఫీల్డ్ అసిస్టెంట్ కే. శేఖర్ కు శనివారం గ్రామంలోని ఉపాధి కూలీలు గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పనిచోట శాలువాతో సత్కరించారు మండలం లోనే గ్రామానికి గుర్తింపు తీసుకు రావడం పట్ల వాళ్లు హర్షం వ్యక్తం చేశారు.


ఫీల్డ్ అసిస్టెంట్‌ను సత్కరిస్తున్న ఉపాధి కూలీలు



మాట్లాడుతున్న అడ్వకేట్ విట్టల్‌రెడ్డి

## గృహ నిర్మాణ కార్మికులకు అవగాహన సదస్సు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** మెద్వాన్ ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డిలోని విజయనగర్ కాలనీలో మాన్ ఫోర్ సోషల్ ఇనిస్టిట్యూట్ సహకారంతో సంగారెడ్డి మునిసిపాలిటీ పరిధిలోని ఇళ్లల్లో పనిచేస్తున్న గృహ కార్మికులకి లీగల్, హౌసింగ్ రైట్స్ గురించి అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో రిసోర్స్ పర్సన్ విట్టల్‌రెడ్డి అడ్వకేట్ హాజరై మాట్లాడుతూ పని ప్రదేశాలలో ఏదైనా నేరారోపణకు, వేధింపులు లేదా లైంగిక వేధింపులకు గురైతే, న్యాయపరమైన సలహాల కోసం న్యాయ సేవాధికారిక సంస్థ లేదా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా రక్షణ చట్టాలు డయల్ 100, సఖి భరోసా, లేదా మహిళ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించి న్యాయపరమైన సహాయం పొందాలన్నారు. మెద్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గృహ కార్మికులు సంఘటితంగా ఉండాఅన్నారు. సమావేశంలో ఎంఆర్‌డిఎస్ కోఆర్డినేటర్ యాదగిరి, కోఆర్డినేటర్స్ పి.స్వప్న, గృహకార్మికులు పాల్గొన్నారు.

## అధిక దిగుబడినిచ్చే విత్తనం అందించడమే లక్ష్యం

### విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** రైతులకు అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలను అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా ఐడిఓసి సమావేశ మందిరంలో వ్యవసాయశాఖ అధికారులు, విత్తన డీలర్లు, సహకార సంఘాలు ఎపిపీటల ఎఫ్‌ఎఫ్‌బిఓల ప్రతినిధులతో నిర్వహించిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఖ యధా బీజం తధా సస్యం " అనే సూత్రాన్ని ప్రస్తావిస్తూ నాణ్యమైన విత్తనాల సాముఖ్యతకు వివరించారు. జిల్లాలో పత్తి తరి, జొన్న, సోయాబీని కందులు, మినుములు వంటి పంటలు సాగవుతున్నందున రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు సమయానికి అందుబాబులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, సంగారెడ్డి డి.ఎస్.పి సత్తయ్యా గౌడ్, డిసిఓ కిరణ్ కుమార్,డి హెచ్ ఎస్ ఓ సోమేశ్వర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కెఎస్‌జి యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు

**అమీన్‌పూర్, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కెఎస్‌జి యువసేన సభ్యులు ముందుకు రావడం అభినందనీయమని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. యువసేన సభ్యులు లక్ష్మణ్, శ్రీనివాస్, సురేష్ ఆధ్వర్యంలో అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్లలో ఏర్పాటు చేయనున్న చలివేంద్రాల కోసం వాటర్ డిస్పెన్సర్లను కాట శ్రీనివాస్‌గౌడ్, సతీమణి కాట సుధా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండలు మండిపోతున్న ఈ సమయంలో బాటసారులు, సామాన్య ప్రజలకు చల్లని తాగునీరు అందించాలనే లక్ష్యంతో యువత ముందుకు రావడం సంతోషకరమన్నారు. సమాజం పట్ల బాధ్యతతో సేవా కార్యక్రమాలు చేపడుతున్న లక్ష్మణ్, శ్రీనివాస్, సురేష్ వంటి యువకులు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తారని తెలిపారు.

## గజగట్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 25,ప్రభాతవార్త:** మండల పరిధి గజగట్లపల్లిలో హైదరాబాద్, సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రి వారి సౌజన్యంతో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంతో ఉపసర్పంచ్ బండారి రాజు, పంచాయాతీ కార్యదర్శి సంతోష్, పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.

# ఫీజు రీయంబర్స్‌మెంట్ ఎత్తివేతకు ప్రభుత్వం కుట్ర

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త**

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రపన్నుతోందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఎబివిపి) ఆరోపించింది. హుస్నాబాద్‌లోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఎబివిపి ఆధ్వర్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోరుతూ కరపత్రాలు విడుదల చేసి ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎబివిపి రాష్ట్ర హాస్టల్స్ కోకన్వీనర్ చింతల పవన్ కుమార్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా నిర్వీర్యంచేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో ప్రైవేట్ విద్యా సంస్థలు హైకోర్టును ఆశ్రయించగా, ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయడంలో నిరక్ష్యం చూపిందని, దీంతో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ద్వారా ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల నుంచి నేరుగా ఫీజులు వసూలు చేసుకోవచ్చని అనుమతించడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా చదువుకుంటున్నారని, ఇంజనీరింగ్, ఫార్మా, లా, మెడిసిన్ వంటి కోర్సుల్లో చేరిన విద్యార్థులు ప్రభుత్వ హామీపై ఆధారపడి అడ్మిషన్లు పొందారని చెప్పారు. ప్రస్తుతం బకాయిలు రూ.10,000 కోట్లకు చేరుకున్నప్పటికీ ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్, హుస్నాబాద్ నగర సంయుక్త కార్యదర్శి అంజి, విరాట్, శశికుమార్, మణికంత, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న ఎబివిపి నాయకులు


అంక్షాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్

## అంక్షాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

**నంగునూరు, ఏప్రిల్ 25, ప్రబభాతవార్త :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని అంక్షాపూర్ గ్రామ సర్పంచ్ మయోజి పద్మ బుచ్చివీరయ్య తెలిపారు. మండల పరిధిలోని అంక్షాపూర్‌లో వోల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న గృహ వినియోగదారులను దృష్టిలో పెట్టుకొని నాలుగో వార్డులో 25 హెచ్‌పి సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం పనిచేస్తాననే నమ్మకంతోనే ప్రజలు తనను ఎన్నుకున్నారని చెప్పారు. గ్రామంలో అవసరమైన ప్రతి సమస్యను ఎమ్మెల్యే హరీష్ రావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లైన్మెన్ మహేష్, నాయకులు బూసిరెడ్డి నరోత్తం రెడ్డి, గార్లపాటి సుధాకర్ రెడ్డి, నర్మెట్ట పరిశరాములు, బందారం భరత్, భరత్ రెడ్డి, వార్డు సభ్యుడు వెంకట్ రెడ్డి, విద్యుత్ సిబ్బంది మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెకు సంఘీభావం తెలిపిన వామపక్షాలకు కృతజ్ఞతలు

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు హుస్నాబాద్‌లో కొనసాగిన ఆర్టీసీ కార్మికుల సమ్మెకు వామపక్ష పార్టీలు సంఘీభావం ప్రకటించాయి. సమ్మె సమయంలో నిర్వహించిన వివిధ నిరసన కార్యక్రమాల్లో వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా తమ సమ్మెకు సంఘీభావంగా వచ్చి నిరసన కార్యక్రమాల్లో భాగస్వామ్యమైన వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలకు జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సమ్మెను విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి హుస్నాబాద్ జేఏసీ తరుపున అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ కార్మికుల హక్కుల పరిరక్షణకు అందరూ ఐక్యంగా నిలవాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.

## బెజ్జంకిలో రోడ్డుపై గుంతలు పూడ్చివేత

**బెజ్జంకి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని 1వ వార్డులో చత్రపతి శివాజీ విగ్రహం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ఉన్న సీసీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను వార్డు సభ్యుడు బొనగం రమేష్ చొరవతో పూడ్చివేశారు. కాంట్రాక్టర్ బాలయ్య సహకారంతో ఈ పనులు నిర్వహించారు. ఈ రహదారి ద్వారా నిత్యం వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రజలు గుంతల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గమనించిన వార్డు సభ్యుడు రమేష్ స్వయంగా రోడ్డును పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టి గుంతలను పూడ్చివేయించారు. రోడ్డు మరమ్మతులతో ప్రజలకు ఉపశమనం కలిగిందని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు వార్డు సభ్యుడి చొరవను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బండి వేణు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**కొండపాక, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** అర్యవైశ్యుల అరాధ్యదైవం వాసవి కన్యకపరమేశ్వరీ మాత జన్మదినాన్ని సిఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా ప్రకటించడంతో శనివారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి అర్యవైశ్య సంఘం అధ్వర్యంలో పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా అర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు కాచం నీన్ కుమార్ మాట్లాడుతూ మేము కోరిన వెంటనే సిఎం రేవంత్‌రెడ్డి అర్యవైశ్య కార్పోరేషన్ ఏర్పాటు చేశారని, మాకు గుర్తింపునిచ్చి కన్యక పరమేశ్వరి జన్మది నాన్ని అధికారికంగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అర్యవైశ్య సంఘం నాయకులు ఉప్పపాండురంగం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పొద్దుటూరి శ్రీనివాస్, వాసవి క్లబ్ మండల అధ్యక్షుడు ఉప్పల రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షడు శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, ఇండ్ల కనకయ్య, నర్సింహ్మాచారి, ఐలయ్య, రవీందర్ పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**కొమురవెల్లి, ఏప్రిల్ 25,ప్రభాతవార్త :** జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కృషితో మండల కేంద్రానికి చెందిన మాక్యల రిత్విక్‌కు రూ.12 వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరు కావడంతో శనివారం లబ్ధిదారునికి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రుల మహేష్ చేతుల మీదు అందజేశారు. సిఎంఆర్ఎఫ్ చెక్కును బ్యాంకు ఖాతాలో జమ చేసుకోవాలన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరు చేయించిన ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గజ్జె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణనకు ప్రజలు సహకరించాలి

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో జనాభా గణన 2027 మొదటి దశ ప్రారంభమైందని, దీనికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి దశ మే 11 నుండి జూన్ 9 వరకు 30 రోజుల పాటు ఇండ్ల జాబితా, ఇండ్ల గణన నిర్వహిస్తారని చెప్పారు. ప్రతి ఇంటి పరిస్థితి, అందులోని సౌకర్యాలు మరియు ప్రాథమిక సమాచారాన్ని ఎన్యుమరేటర్లు సేకరిస్తారని తెలిపారు. ప్రజలు తమ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఏప్రిల్ 26 నుండి మే 10 లోపు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారు తమ ఎస్ఈఐడిని ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు అందజేయాలని తెలిపారు. ఈ వివరాలను ఎలాంటి పన్నులు లేదా ఇతర దర్యాప్తులకు ఉపయోగించరని వారు భరోసా ఇచ్చారు. సరైన పాఠశాలలు, ఆసుపత్రులు, రవాణా సౌకర్యాల కల్పన కోసం ఖచ్చితమైన సమాచారం అవసరమని, మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ తమ ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు సంపూర్ణ సహకారం అందించి, సరైన వివరాలు నమోదు చేయించాలని కోరారు.

## నేడు పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు గణపతి పూజ, స్థాపిత దేవతా హోమం, ధాన్యాదివాసము, మహాస్నపనము, ఫర్యాగ్నికరణము, సాయంత్రం 5 గంటలకు శయ్యాదివాసము, పుష్యాదివాసము, ఫలాదివాసము, గర్త సంస్కారము, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. 26వ తేదీ ఆదివారం ఉదయం 7.55 గంటలకు మఘ నక్షత్రయుక్త వృషభ లగ్నమున విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, నేత్రోన్మీలనము, పూర్ణాహుతి, బలి ప్రదానము, కళాన్యాసము, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతందని తెలిపారు. అలాగే సోమవారం దుర్గమ్మ కొలుపు పండుగను నిర్వహించడం జరుగుతుందని ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు మహా అన్న ప్రసాద వితరణ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిష్ఠా మహోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## సంగారెడ్డిలో ఆర్టీసీ కార్మికుల సంబరాలు

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** తమ సమస్యను పరిష్కరించాలంటూ సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో శనివారం సంగారెడ్డి లోని ఆర్టీసీ డిపో కార్యాలయం ముందు ఆర్టీసీ కార్మికులు సంబరాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా టపాసులు కాల్చారు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకుంటున్న ఆర్టీసీ కార్మికులు

